క్లుప్తంగా

తహసీల్దార్ ఆనంద్ కుమార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ ఆనంద్ కుమార్

పద్మనాభం: పద్మనాభం తహసీల్దార్‌గా ఎం.ఆనంద్ కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మన్యం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన ఎస్.వెంకటరావు శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆనంద్ కుమార్ వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ యోగి, ఆర్‌ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పన్నకు బంగారు హారం బహూకరణ



ఈవో శ్రీనివాసమూర్తికి బంగారుహారం అందజేస్తున్న దాత సూర్యచంద్రరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నగరంలోని మధురవాడ ప్రాంతానికి చెందిన కె.సూర్యచంద్రరావు అనే దాత 350 గ్రాముల బంగారు హారాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు. అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, వీబీవీ రమణమూర్తి, ఏఈ హరి, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'చిత్రలేఖనం'లో మెరిసిన చిన్నారులు

- జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు



టి.హర్షిణి



ఎ.నిఖిల్

తగరపువలస: అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నగరంలోని ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు లభించాయి. 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు టి.హర్షిణి, ఎ.నిఖిల్ కేటగిరీ-2లో వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. మూడు కేటగిరీలలో జరిగిన ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఈ ఇద్దరు విద్యార్థులు మాత్రమే బహుమతులు గెలుచుకోవడం గమనార్హం.

జాతీయ విద్యావిధానంపై అవగాహన



శొంఠ్యాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఎన్ఎస్ఆర్ఐటీ విద్యార్థులు

తగరపువలస: జాతీయ విద్యావిధానం-2020తో మానవ వనరుల్లో నాణ్యత పెరిగిందని ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్ అన్నారు. శొంఠ్యాం జెడ్పీహైస్కూల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యావిధానం గురించి విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యావిధానంలో మార్పులను ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో హరిగోపాల్, ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జలం.. జటిలం

ఆ ప్రాంతంలో జల సమస్య జటిలంగా మారింది. 350 అడుగుల పాతాళానికి యంత్రాలతో డ్రిల్లింగ్ చేస్తున్నా గంగ జాడ కనిపించడం లేదు. ఒకవేళ అదృష్టవశాత్తు నీరు పడినా తాగు నీటి అవసరాలకు పనికిరాని ఉప్పునీరే అవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలోనే ఉన్నా నిర్జలంగా మారుతున్న ఆ ప్రాంతమే చిట్టివలస.

- పాతాళానికి తవ్వినా కానరాని గంగ జాడ
- బావురుమంటున్న బోర్లు
- మొరాయిస్తున్న మోటార్లు
- 'గోస్తని' ప్రక్షాళనే శరణ్యం



జ్యూట్‌మిల్లు రోడ్డులో బోరుబావుల నుంచి నీరు పడని ప్రాంతం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలసలో నీటిజాడ లేక బోరుబావులు బావురుమంటున్నాయి. ఈ ప్రాంతవాసులు నీటికోసం ఎంతో ఇబ్బంది పడుతున్నారు. వందల సంఖ్యలో ఏ ఒక్కరికో 80 నుంచి 100 అడుగులలోపు నీరు పడుతున్నా.. అది కూడా 7 నుంచి 9 నిముషాల వ్యవధిలోనే అడుగంటిపోవడంతో మోటార్లు మొరాయిస్తున్నాయని వాపోతున్నారు. కనీసం 300 లీటర్ల నీరు కూడా బోరుబావులు ఇవ్వలేకపోతున్నాయంటున్నారు. చిట్టివలస కార్మికవాడ మొదలుకుని చావుల మదుం రోడ్డు, గుడివాడ అప్రోచ్‌రోడ్డు, లక్ష్మినాయుడు కళ్లాలు, గణేష్ థియేటర్ డౌన్, సంతపేట అంబేడ్కర్ ప్రాంతాలు, సత్యసాయిసేవా సమితి, జ్యూట్‌మిల్లు రామాలయం, సప్తగిరి థియేటర్, పెరికివీధి, మిల్లు బాయిలర్ గేట్ ప్రాంతాలు కలుపుకొని గోస్తని నది వరకు ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

గృహ నిర్మాణాలకు వెనుకంజ

నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ఈ ప్రాంతంలో గజం రూ.35 వేలు వంతున ఇప్పటికే ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన వారు నిర్మాణాలకు వెనుకాడుతున్నారు. అపార్ట్‌మెంట్లలో వెయ్యి చదరపు అడుగుల ఫ్లాట్లు రూ.30 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వారు విక్రయానికి సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే నిర్మించుకున్నవారు బయట నుంచి తాగునీరుపై ఆధారపడుతున్నారు. ఇటీవల గోస్తని నది పూనిగట్టు వద్ద ఏర్పాటైన తిరుమల విద్యాసంస్థల నిర్వాహకులు కూడా నీటి సమస్య కారణంగా నిత్యం బయట నుంచి వచ్చే ట్యాంకర్ల పైనే ఆధారపడుతున్నారు.

నాడు గంటా పాపమే నేడు శాపమై..

2014-19 టీడీపీ హయాంలో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు గోస్తని నదిని చావు దెబ్బ తీశారు. చిట్టివలస పెద్ద చెరువులోకి మళ్లుతున్న తగరపువలస డ్రైనేజీలను గోస్తని నదిలోకి మళ్లించడంతో నది పవిత్రత కోల్పోయింది. గతంలో జ్యూట్‌మిల్లు యాజమాన్యం నిర్మించిన పూనిగట్టు శిథిలం కావడంతో ఆటుపోట్ల సమయంలో సముద్రం నుంచి నీరు ఉప్పుటేరు మీదుగా తగరపువలసను తాకడంతో అడుగుజలాలు ఉప్పగా మారిపోయాయి.



చిట్టివలస పూనిగట్టు వద్ద వృథాగా పోతున్న వర్షం నీరు

ప్రస్తుతం చిట్టివలస ప్రజలు తాగునీటికి ఎదుర్కొంటున్న కష్టాలు త్వరలో తగరపువలసనూ తాకనున్నాయి. ఈ క్లిష్టమైన పరిస్థితుల నుంచి గట్టెక్కాలంటే గోస్తని నదిని బతికించుకోవాలని స్థానికులు అంటున్నారు.

చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తేనే..

గోస్తని నది ప్రక్షాళన పనులు చేపట్టి చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే తప్ప చిట్టివలస, తగరపువలస ప్రాంతవాసుల తాగునీటి కష్టాలు తీరవని నిపుణులు అంటున్నారు. ఇప్పటి నుంచే నది రక్షణ పనులు చేపడితే అయిదేళ్లకు ఫలితాలు వస్తాయంటున్నారు.



350 అడుగులకు వెళ్లినా నీరు పడని లక్ష్మీనాయుడు కళ్లాలు ప్రాంతం

బోరుబావుల పరిస్థితి ఘోరం



చిట్టివలస జ్యూట్‌మిల్లు పరిసరాలలో ప్రస్తుతం తవ్వే బోర్లు చుక్క నీరు ఇవ్వడం లేదు. ఆశ చావని వారు వ్యయప్రయాసలకు ఓర్చి తవ్వించినా కన్నీరే మిగులుతుంది. వ్యక్తిగత ఇల్లు ఉన్నవారు ఎలాగో నెట్టుకు వస్తున్నా అపార్ట్‌మెంట్లలో ఉన్నవారి పరిస్థితి దయనీయంగా ఉంది.

– రొక్కం శ్రీను, కొత్తపేట

ఏడు నిమిషాలకే మొరాయిస్తున్నాయి..



లక్ష్మినాయుడు కళ్లాల్లో బోరు మోటారు ఆన్‌చేసిన 7 నిమిషాలకే నీరు అయిపోతుంది. కనీసం 200 లీటర్లు నీరు కూడా రావడం లేదు. ఇలా తరచూ ఆన్ చేయడం వలన మోటార్లు చెడిపోతున్నాయి. ఇటీవల ఈ ప్రాంతంలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. భవిష్యత్తు తలచుకుంటే ఆందోళనగా ఉంది.

– మొకర చిన్ని, లక్ష్మినాయుడు కళ్లాలు

ఆర్‌టీవో అధికారుల విస్తృత తనిఖీలు



నిబంధనలు ఉల్లంఘించడంతో పెనాల్టీ విధిస్తున్న ఆర్‌టీవో రాజారావు

మధురవాడ: ఆర్టీవో అధికారులు సోమవారం సాయంత్రం విస్తృత తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్స్ ఉన్న, బ్లాక్ ఫిల్మింగ్ వాహనాలపై చర్యల కోసం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు. మధురవాడ, పీఎం పాలెం ప్రాంతాల్లో హెచ్‌ఎస్‌డీ నంబర్ ప్లేట్లు లేకుండా, అస్సలు నెంబర్ ప్లేటు మీద నెంబరే లేకుండా ఇతర అక్షరాలు ఉన్న వాహనాలు చూసి ఆశ్చర్యపోయారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఆర్‌టీవోలు బి.రాజారావు, మాధవి అపరాధ రుసుము విధించారు. ట్రాఫిక్ ఎస్ఐ జోగిరాజు, ఇతర పోలీసు, ఆర్‌టీవో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'కు 10 వినతులు



అర్జీ స్వీకరిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి ఎనిమిది, పట్టణ ప్రణాళికా విభాగానికి రెండు వినతులు రాగా పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంఈవో పద్మావతికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

తగరపువలస : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆనందపురం మండల యూటీఎఫ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, ఎంఈవో పద్మావతిలకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధులు టి.ఆర్.అంబేడ్కర్, ఉప్పాడ రాము మాట్లాడుతూ జీవో నంబర్ 117ను రద్దు చేసి 55 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. హైస్కూళ్లలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు, హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం, కిలోమీటరు దూరం పైబడి నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం తదితర 20 రకాల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కిరణ్‌కుమార్, సత్యనందన్ తదితరులు పాల్గొన్నారు.

మూసేసిన రోడ్లను తెరిపించాలని నిరసన



ఈఈ శాంతి రాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డులోకి వచ్చే కె-1, కె-2 కాలనీలతో పాటు ఎన్టీఆర్ హుద్‌హుద్ కాలనీ, శాప్ స్టేడియం తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్లను తెరిపించాలని మధురవాడ జోన్-2 కార్యాలయం వద్ద కాలనీ వాసులు నిరసన చేపట్టారు. తర్వాత జోనల్ కమిషనర్ చాంబర్ ఎదుట బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు అప్పలరాజు, రాజ్‌కుమార్, కాలనీ నాయకులు అవతార్‌సింగ్, ఎస్‌డీ బాబా తదితరులు మాట్లాడుతూ ఒక ప్రైవేటు వ్యక్తికి, జీవీఎంసీ అధికారులకు మధ్య నెలకొన్న వివాదం కారణంగా జవహర్ నవోదయ వద్ద స్థల యజమాని ఆ రహదారిని కోర్టు ఆర్డర్‌తో మూసేశాడన్నారు. దీంతో ఆర్‌టీసీ బస్సులు, ఆటోల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈఈ శాంతి రాజు బయటికి వచ్చి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వినతి పత్రం ఇచ్చి నిరసన విరమించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు బి. భారతి, సుజాత, కాలనీ నాయకులు కె. అమీర్, ఎస్. కేశవ, పావెల్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మారికవలస- తిమ్మాపురం రోడ్డులో ప్రమాదం

- విద్యుత్ స్తంభం, కారు ధ్వంసం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని భారీగా దెబ్బతిన్న కారు

మధురవాడ : భీమిలి సరిహద్దు ప్రాంతం మారికవలస-తిమ్మాపురం రోడ్డులో నారాయణ కళాశాల సమీపంలో ఆదివారం అర్ధరాత్రి 1.30 ప్రాంతంలో రోడ్డు ప్రమాదం సంభవించింది. ఒక కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో సుమారు రెండు గంటల పాటు మధురవాడ ప్రాంతంలో విద్యుత్ నిలిచిపోయింది. విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో సుమారు రు. 70 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. కారు ముందు భాగం దెబ్బతింది. ఇంజిన్‌లోని కొన్ని భాగాలు ఎగిరి పడ్డాయి. బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పినట్టు తెలిసింది. సంఘటనా స్థలిలో మందు బాటిళ్లు పడి ఉండడంతో మద్యం మత్తులోనే ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు అంటున్నారు. అయితే ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై భీమిలి సబ్‌స్టేషన్ ఏఈని వివరణ కోరే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. ఇంత భారీ ప్రమాదం జరిగినా ఎవ్వరూ నోరు మెదపకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మైనింగ్ పేరిట విధ్వంసం తగదు



ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌తో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తగరపువలస : నాలుగు వేల మంది నివసిస్తున్న ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీలో కొండలను మైనింగ్ పేరుతో ధ్వంసం చేసి పర్యావరణాన్ని కలుషితం చేయొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఇక్కడ క్వారీ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సోమవారం సీపీఎం బృందం పర్యటించింది. ఆగస్టు 28న అభిప్రాయ సేకరణకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డులో అతికించిన సమాచారం మేరకు ఈ బృందం సర్వే నంబర్ 104లోని కొండలను పరిశీలించింది. జీడి మామిడి, ఇతర తోటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రాంతంలో మైనింగ్ సరికాదన్నారు. ఇక్కడ సర్వే నంబరులోని 69 ఎకరాలను మైనింగ్ కోసం ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం సరికాదన్నారు. కోవిడ్, తుపాన్ల వంటి కష్టకాలంలో ఈ కొండలే పర్యావరణానికి అండగా నిలిచాయన్నారు. ఖనిజ తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని పంచాయతీ వాసులతో ఆందోళన చేపట్టారు. మండల తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌ను మైనింగ్ అనుమతుల గురించి ప్రశ్నించగా తనకు ఎలాంటి సమాచారం లేదని, కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలో నోటీసులు అతికించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, జోన్ కమిటీ సభ్యులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, ఎస్.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'శిక్షా సప్తాహ్'



అరటిపండ్లు బహూకరించిన దాతలతో బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

తగరపువలస: నూతన విద్యావిధానాన్ని అనుసరించి వారం రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం నాటి సహపంక్తి భోజనాలతో ముగిసింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు పాఠశాలలకు పండ్లు, స్వీట్లు, పులిహోర వంటి ఆహార పదార్థాలు అందించారు. బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మనాభం : పాఠశాలల్లో వారం రోజుల నుంచి జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు భోజనాలతో ఆరగించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, సర్పంచ్ తాలాడ పాప అరటి పండ్లు, స్వీట్లు సొంత నిధులతో అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గాడు అప్పలరాజు, గంగిరెడ్ల పద్మనాభస్వామి, హెచ్‌ఎం బాలామణి పాల్గొన్నారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భోజనాలకు పీడీ శేషు స్వీట్లు, అరటి పండ్లు ఇచ్చారు. విద్యార్థులతో కలిసి ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరుగుడి ఆదిబాబు, నాయకుడు ఈర్ల ఈశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి దామోదరరావు విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రంలో హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు. తునివలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఎంఈవో పి.రమణ భోజనం చేశారు.



పద్మనాభం హైస్కూల్లో విద్యార్థులకు స్వీట్లు, అరటి పండ్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పద్మనాభం



రెడ్డిపల్లి హైస్కూల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉప సర్పంచ్ ఆదిబాబు తదితరులు

'గీతం'లో ముగిసిన ఎఫ్‌డీపీ

కొమ్మాది: కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ కోర్సులు అభ్యసిస్తున్న అధ్యాపకులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)సోమవారం ముగిసింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, గీతం అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. సీఎస్ఈ విభాగం డీన్ ప్రొఫెసర్ శాంతి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ బోధించే అధ్యాపకులు నిరంతరం నూతన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

జోనల్ కార్యాలయం ప్రారంభం



జోనల్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా, మేయర్ హరివెంకటకుమారి

భీమునిపట్నం : ప్రజలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న భీమిలి మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు త్వరలో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఇక్కడ గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 50 లక్షలతో ఆధునీకరించిన జోనల్ కార్యాలయ భవనాన్ని పునఃప్రారంభించారు. ఇక్కడి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ ఆస్తులు తొలగించవలసి వస్తే తగిన నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. అంతకు ముందు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్న కుమారిలక్ష్మి, నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షుడు పంచకర్ల సందీప్, బీజేపీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న యువకుడు

కొమ్మాది : నగరంలో ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న వి. ఈశ్వరరావు, రామ్మోహన్, భరత్ ఆదివారం సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. అనంతరం స్నానం చేసేందుకు సముద్రంలో దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల ముగ్గురు యువకులు కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ వీరిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. వీరిలో ఇద్దరు సురక్షితంగా బయట పడిన విషయం తెలిసిందే. ఈశ్వరరావు పరిస్థితి మాత్రం విషమంగా ఉండడంతో ఆదివారం వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. సోమవారం ఈశ్వరరావుకు ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపినట్లు మెరైన్ పోలీసులు చెప్పారు.

త్వరితగతిన మరుగుదొడ్ల సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీవో శైలజ

పద్మనాభం: వ్యక్తిగత మరుగు దొడ్ల సర్వేను త్వరితగతిన చేపట్టాలని ఎంపీడీవో బి.శైలజ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత మరుగు దొడ్ల సర్వే చేపట్టాలన్నారు. మరుగు దొడ్లు ఉంటే సొంత సొమ్ముతో నిర్మించుకున్నారా, ప్రభుత్వ సొమ్ముతో కట్టుకున్నారా తెలుసుకోవాలన్నారు. మరుగుదొడ్లను వాడుతున్నారో లేదో సర్వేలో గుర్తించాలన్నారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రంలోగా ఈ సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టే పారిశుధ్య కార్యక్రమాల వివరాలను సంబంధిత యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ పద్మజ పాల్గొన్నారు.

లక్ష తులసి పూజలో భాగస్వాములు కావాలి

పద్మనాభం: కుంతీ మాధవ స్వామి ఆలయంలో వచ్చే నెల 30వ తేదీన నిర్వహించనున్న లక్ష తులసి పూజలో భక్తులు భాగస్వాములు కావాలని ఈవో నానాజీ బాబు కోరారు. లక్ష తులసి పూజకు సంబంధించి భక్తులు, నాయకులతో ఆలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పూజ నిర్వహణకు భక్తులు తమ వంతు విరాళాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, అనంత పద్మనాభ స్వామి సేవా సంఘం అధ్యక్షుడు డి.గోపాల కృష్ణ మూర్తిరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, తాలాడ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం ప్రవేశాలు కల్పించాలి

తగరపువలస : విద్యాహక్కు చట్టం 12 (1)సి ప్రకారం దిగువ, మధ్య తరగతి పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు జరిగేలా చూడాలని కోరుతూ ఆనందపురం మండలం వేములవలసకు చెందిన పతివాడ అప్పలరాజు కోరారు. ఈ మేరకు ఆయన జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు చేతన్‌కృష్ణకు స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో గత నెల 26న ఒకటవ తరగతికి సంబంధించి అడ్మిషన్ లభించిందన్నారు. మర్నాడే అవసరమైన అన్ని డాక్యుమెంట్లను స్కూల్ యాజమాన్యానికి అందించానన్నారు. అయినప్పటికీ నెలరోజులుగా సాకులు చూపుతూ స్కూల్ యాజమాన్యం ఇప్పటి వరకు చేర్చుకోలేదన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ కలెక్టర్, డీఈవోలకు కూడా వినతిపత్రాలు అందించానన్నారు. తనకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

